


రిపబ్లిక్
# హిందుస్థాన్
తెలుగు దినపత్రిక




సంపుటి-1, సంచిక-4, 07-08-2026, ఎడిటర్ : రాథోడ్ రాజు ఎజీలు-4, వెల రూ. 4/-

Warangal, Ranga Reddy, Khammam, Nizamabad, Karimnagar, Hyderabad, Mahabubnagar, Visakhapatnam, Kadapa, Vijayawada, Tirupati, Guntur, Kurnool, Nellore, Srikakulam

# మసాలాల పేరుతో విషం..!

## హైదరాబాద్‌లో భారీ కల్తీ మసాలా ముఠా గుట్టురట్టు
## 25 టన్నుల కల్తీ మసాలాలు, 89 టన్నుల ముడిసరుకు స్వాధీనం..
## ముగ్గురు అరెస్ట్.. రాష్ట్రవ్యాప్తంగా విస్తరించిన నెట్‌వర్క్‌పై సిట్ దర్యాప్తు



హైదరాబాద్ ప్రతినిధి, ,(రిపబ్లిక్‌హిందుస్థాన్):ప్రజలఆరోగ్యంతో చెలగాటమాడుతున్న భారీ కల్తీ మసాలా ముఠాను హైదరాబాద్ పోలీసులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు సంయుక్తంగా ఛేదించారు. కాటేదాన్, బాలాపూర్, మైలార్‌దేవ్‌పల్లి ప్రాంతాల్లో నిర్వహించిన మెరుపు దాడుల్లో నాసిరకం మసాలా దినుసులకు హానికర రసాయనాలు, పారిశ్రామిక రంగులు కలిపి ప్రముఖ బ్రాండ్ల పేర్లతో మార్కెట్లో విక్రయిస్తున్న వ్యవహారం వెలుగులోకి వచ్చింది. మొత్తం 25 టన్నుల కల్తీ మసాలాలు, 89 టన్నులకుపైగా ముడిసరుకు స్వాధీనం చేసుకోగా, ఈ వ్యవహారంలో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.

ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ముప్పు

హోటళ్లు, రెస్టారెంట్లు, ఫంక్షన్ హాళ్లు, క్యాటరింగ్ సంస్థలను లక్ష్యంగా చేసుకుని తక్కువ ధరలకు కల్తీ మసాలాలను సరఫరా చేస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. లవంగాలు, ఆవాలు, జీలకర్ర, వాము, షాజీరా, మెంతులు, సోంపు, నువ్వులు వంటి దినుసులకు సింథటిక్ రంగులు, ఫ్యాబ్రిక్ డైలు, టాల్కమ్ పౌడర్, రైస్ బ్రాన్ ఆయిల్ వంటి పదార్థాలు కలిపి ఆకర్షణీయంగా మార్చి విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

క్యాన్సర్ నుంచి కాలేయ వ్యాధుల వరకు ప్రమాదమే

ఈ విషపూరిత రసాయనాలు కలిసిన మసాలాలను దీర్ఘకాలంగా వినియోగించడం వల్ల కాలేయ వ్యాధులు, క్యాన్సర్, మూత్రపిండాల సమస్యలు, జీర్ణకోశ వ్యాధులు, అల్సర్లు, అలర్జీలు, చర్మవ్యాధులు, నరాల వ్యవస్థ దెబ్బతినే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడిన వారిపై హత్యాయత్నానికి సమానమైన తీవ్రమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తున్నట్లు

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలే లక్ష్యం

- సీఎంఎస్ ద్వారా సరఫరా అయ్యే మందులు,
- సర్జికల్స్‌పై సమగ్ర లిస్ట్ బుక్‌ను వైద్యులకు అందజేస్తున్న అధికారులు
- మందుల సమర్థ వినియోగం, పారదర్శక సరఫరా వ్యవస్థకు కొత్త ఊతం
- ప్రిన్సిపల్ సంధ్యారాణి

హైదరాబాద్, ప్రతినిధి, ,(రిపబ్లిక్ హిందుస్థాన్): ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు మరింత సమర్థవంతంగా అందించడంతో పాటు, ప్రభుత్వ సరఫరాలో అందుబాటులో ఉన్న మందులు, సర్జికల్ వస్తువుల వినియోగాన్ని పెంచే లక్ష్యంతో సెంట్రల్ మెడిసిన్ స్టోర్స్ (జమీా) కీలక చర్యలు చేపట్టింది. రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనాసుపత్రులు, జిల్లా ఆసుపత్రులు, ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సేవలందిస్తున్న వైద్యులకు సీఎంఎస్ ద్వారా సరఫరా అయ్యే అన్ని రకాల మందులు, సర్జికల్ వస్తువులు, వినియోగ సామగ్రికి సంబంధించిన సమగ్ర సమాచార లిస్ట్ బుక్‌ను అందజేస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ సంధ్యారాణి తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స అందించే ప్రతి వైద్యుడు ప్రభుత్వ సరఫరాలో ఏయే మందులు అందుబాటులో ఉన్నాయో స్పష్టంగా తెలుసుకొని, వాటిని రోగుల చికిత్సలో సమర్థవంతంగా వినియోగించేందుకు ఈ పుస్తకం ఉపయోగపడుతుందని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందే ప్రజలకు అవసరమైన మందులు ప్రభుత్వమే ఉచితంగా అందిస్తున్న నేపథ్యంలో, వాటిపై వైద్యులకు పూర్తి సమాచారం ఉండడం అత్యంత అవసరమని ఆమె అభిప్రాయపడ్డారు.



### ప్రతి ఔషధంపై సమగ్ర సమాచారం

సీఎంఎస్ అధికారులు రూపొందించిన ఈ లిస్ట్ బుక్‌లో ప్రభుత్వ సరఫరాలో ఉన్న ఔషధాల పేర్లు, వాటి బలం , డోసేజ్ ఫార్మ్, అందుబాటులో ఉన్న ప్యాకింగ్ విధానం, వినియోగానికి సంబంధించిన ముఖ్య వివరాలు, వివిధ విభాగాల వారీగా మందుల వర్గీకరణ, అలాగే సర్జికల్ వినియోగ వస్తువుల వివరాలను పొందుపరిచినట్లు అధికారులు తెలిపారు. ఈ పుస్తకం ద్వారా ఏ వ్యాధికి సంబంధించి ప్రభుత్వ సరఫరాలో ఏ మందులు అందుబాటులో ఉన్నాయో వైద్యులు సులభంగా గుర్తించగలరని, తద్వారా అవసరానికి అనుగుణంగా రోగులకు తక్షణ చికిత్స అందించడం మరింత సులభమవుతుందని పేర్కొన్నారు.

# 11 కొత్త విమాన శిక్షణ సంస్థలకు అనుమతులు

## 11 కొత్త విమాన శిక్షణ సంస్థలకు ఉద్దేశపత్రాల ప్రదానం - పైలట్ శిక్షణ సామర్థ్యాల పెంపుపై కేంద్రం దృష్టి

న్యూఢిల్లీ, ,(రిపబ్లిక్ హిందుస్థాన్): దేశంలో విమానయాన రంగానికి మరింత ఊతమిచ్చే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కొత్తగా 11 విమాన శిక్షణ సంస్థల (ఫ్లయింగ్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్స్) ఏర్పాటుకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఉద్దేశపత్రాలను అందజేశారు. దేశంలో పైలట్ల కొరతను తగ్గించి, నాణ్యమైన విమాన శిక్షణను విస్తరించడమే ఈ నిర్ణయం ప్రధాన లక్ష్యంగా అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా ఇప్పటికే పనిచేస్తున్న విమాన శిక్షణ సంస్థల ప్రతినిధులతో మంత్రి రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. శిక్షణా ప్రమాణాల మెరుగుదల, మౌలిక వసతుల అభివృద్ధి, శిక్షణలో ఎదురవుతున్న సమస్యలు, భవిష్యత్ అవసరాలపై విస్తృతంగా చర్చించారు. దేశంలో విమానయాన రంగం వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో మరింత మంది నైపుణ్యం కలిగిన పైలట్లను తీర్చిదిద్దాల్సిన అవసరాన్ని మంత్రి వివరించారు.

విమాన శిక్షణ ప్రక్రియను మరింత పారదర్శకంగా, సులభతరం చేయడానికి ప్రత్యేకంగా రూపొందించిన విమాన శిక్షణ స్లాట్ యాప్‌ను కూడా కేంద్ర మంత్రి ప్రారంభించారు. ఈ యాప్ ద్వారా శిక్షణా స్లాట్‌ల కేటాయింపు, నిర్వహణ, పర్యవేక్షణ మరింత సమర్థవంతంగా జరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. దేశంలో విమానాల సంఖ్య, విమానాశ్రయాల విస్తరణతో పాటు శిక్షణ పొందిన పైలట్ల అవసరం కూడా పెరుగుతోందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. ఈ నేపథ్యంలో కొత్త శిక్షణ సంస్థల ఏర్పాటు ద్వారా యువతకు మరిన్ని అవకాశాలు లభించడంతో పాటు దేశీయ విమానయాన రంగానికి అవసరమైన మానవ వనరులు అందుబాటులోకి వస్తాయని వెల్లడించింది.

విమాన శిక్షణలో ఆధునిక సాంకేతికత వినియోగం, భద్రతా ప్రమాణాలు, నాణ్యమైన శిక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని కేంద్ర మంత్రి సూచించారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా శిక్షణా విధానాలను అమలు చేయడం ద్వారా భారతదేశాన్ని విమానయాన శిక్షణలో అగ్రగామిగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ఈ చర్యలతో దేశంలో విమానయాన రంగానికి కొత్త ఊపు లభించనుండగా, శిక్షణ పొందే విద్యార్థులకు మరిన్ని అవకాశాలు ఏర్పడనున్నాయి. నైపుణ్యం కలిగిన పైలట్ల తయారీని వేగవంతం చేయడంతో పాటు భారతదేశాన్ని ప్రపంచ




విమానయాన రంగంలో మరింత బలోపేతం చేయడంలో ఈ నిర్ణయాలు కీలకంగా నిలుస్తాయని

### కేబినెట్ సమావేశంలో చంద్రబాబు ఘాటు వ్యాఖ్యలు

# పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన సీఎం



అమరావతి ,(రిపబ్లిక్ హిందుస్థాన్): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాజకీయాల పేరుతో తీవ్ర నేరాలకు పాల్పడుతున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆరోపించారు. వైసీపీ నేతల అరాచకాలకు అడ్డుకట్ట వేయడానికి తమకు రెండు నిమిషాలు కూడా సరిపోతాయని ఘాటుగా హెచ్చరించారు. అమరావతి సచివాలయంలో గురువారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేసినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా నిర్వహించిన డీఎస్సీ నియామక ప్రక్రియపై అనవసర ఆరోపణలు చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. న్యాయస్థానం వ్యాఖ్యలను కూడా పట్టించుకోకుండా కావాలనే వివాదాలు సృష్టిస్తూ రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.డీఎస్సీ వ్యవహారంపై వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని, తప్పుడు ఆరోపణలను క్షేత్రస్థాయిలో

# మహిళా ఉద్యోగుల సంఘం ప్రతినిధులతో సీఎం భేటీ

### వివిధ అంశాలపై ప్రతినిధులతో చర్చ - మహిళా ఉద్యోగుల సమస్యలపై వినతులు



బెంగళూరు,,(రిపబ్లిక్ హిందుస్థాన్): అఖిల కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ మహిళా ఉద్యోగుల సంఘం జిల్లా, తాలూకా స్థాయి ప్రతినిధుల బృందం గురువారం కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను ఆయన అధికారిక నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులకు సంబంధించిన పలు అంశాలపై ప్రతినిధులు ముఖ్యమంత్రితో చర్చించారు. ఉద్యోగినుల సంక్షేమం, సేవా సంబంధిత అంశాలు, కార్యాలయాల్లో ఎదురవుతున్న సమస్యలు తదితర విషయాలను ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లింది. మహిళా ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం మరింత ప్రాధాన్యం ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు.

ప్రతినిధుల అభిప్రాయాలను శ్రద్ధగా విన్న డీకే శివకుమార్, ప్రభుత్వం మహిళా ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలిపారు. ఉద్యోగుల సమస్యలను సంబంధిత శాఖల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో కర్ణాటక ముఖ్యమంత్రి అదనపు ప్రధాన కార్యదర్శి తుషార్

మొదటిపేజీ తరువాయి

# మసాలాల పేరుతో విషం..!



వెల్లడించారు.

**13 యూనిట్లపై దాడులు**

విశ్వసనీయ సమాచారం మేరకు హైదరాబాద్ ఫుడ్ అడల్ట్రేషన్ సర్వైలెన్స్ టీమ్ (ఎ-ఫీూూ), జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారులు సంయుక్తంగా 13 ప్రాసెసింగ్ యూనిట్లపై దాడులు నిర్వహించారు. మూడు కేసులు నమోదు చేసి, కాటేదాన్‌కు చెందిన రాహుల్ బాటి, బేగంబజార్‌కు చెందిన విశాల్ పన్వార్, దులీచంద్ కచ్చవాలను అరెస్టు చేశారు.

స్వాధీనం చేసుకున్నవి

దాడుల్లో వేల కిలోల వాము, జీలకర్ర, ఆవాలు, షాజీరా, లవంగాలు, మెంతులు, సోంపు, నువ్వులు, జీలకర్ర పొడి, షైనింగ్ పౌడర్, సింథటిక్ ఫ్యాబ్రిక్ డైలు, రైస్ బ్రాన్ ఆయిల్‌తో పాటు మూడు రోలింగ్ మెషిన్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

రూ. కోట్ల టర్నోవర్.. రెండు తెలుగు రాష్ట్రాలకు సరఫరా

ప్రాథమిక విచారణలో ఈ ముఠా గత కొన్నేళ్లుగా భారీ స్థాయిలో కల్తీ మసాలాల వ్యాపారం నిర్వహిస్తున్నట్లు తేలింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఇతర ప్రాంతాలకు కూడా సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. కోట్ల రూపాయల టర్నోవర్, లక్షలాది మంది వినియోగదారులు ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

**సిట్‌తో సమగ్ర దర్యాప్తు...**

ఈ కేసు వెనుక మరింత పెద్ద నెట్‌వర్క్ ఉండే అవకాశం ఉందని భావించిన హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. నిందితుల ఆర్థిక లావాదేవీలు, సరఫరా వ్యవస్థ, ఇతర రాష్ట్రాలతో ఉన్న సంబంధాలపై దర్యాప్తు కొనసాగుతోంది.

140 రోజుల్లో 202 కేసులు

హైదరాబాద్ ఫుడ్ అడల్ట్రేషన్ సర్వైలెన్స్ టీమ్ ఏర్పాటు చేసిన 140 రోజుల్లోనే 202 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి, 246 టన్నులకుపైగా కల్తీ ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకుంది. కల్తీ పన్నీర్, కుళ్లిన మాంసం, కల్తీ పెరుగు, నెయ్యి, పండ్లు, ఊరగాయలు, టీ పొడి తదితరాలపై కూడా భారీ ఎత్తున చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

**ప్రజలకు సూచన**

తమ పరిసరాల్లో కల్తీ ఆహార పదార్థాల తయారీ, నిల్వ, విక్రయం జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే డయల్-100 లేదా ఎ-ఫీూూ హెల్ప్‌లైన్: 8712661212కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

# మహిళా ఉద్యోగుల సంఘం ప్రతినిధులతో సీఎం భేటీ



గిరినాథ్ కూడా పాల్గొన్నారు. ప్రతినిధులు ప్రస్తావించిన అంశాలపై ఆయన కూడా స్పందిస్తూ సంబంధిత శాఖలతో సమన్వయం చేస్తామని తెలిపారు. మహిళా ఉద్యోగుల సంక్షేమం, సేవా పరిస్థితుల మెరుగుదలకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ఈ సందర్భంగా ప్రతినిధులకు వివరించారు. ప్రభుత్వంతో ఉద్యోగినుల సంఘాల మధ్య సమన్వయం మరింత బలోపేతం కావాల్సిన అవసరాన్ని సమావేశంలో ప్రస్తావించారు. సమావేశం అనంతరం మహిళా ఉద్యోగుల సంఘం ప్రతినిధులు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం మహిళా ఉద్యోగుల సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలు మరింత ఫలప్రదంగా కొనసాగాలని ఆకాంక్షించారు.

# రష్యాపై భారీ డ్రోన్ దాడి...

మాస్కో,(రిపబ్లిక్ హిందుస్థాన్): రష్యా--ఉక్రెయిన్ యుద్ధం మరోసారి తీవ్రరూపం దాల్చింది. భారీ సంఖ్యలో డ్రోన్లతో ఉక్రెయిన్ రష్యాపై దాడులకు పాల్పడింది. ముఖ్యంగా యరోస్లావిల్ నగరంలోని కీలక ఆయిల్ రిఫైనరీని లక్ష్యంగా చేసుకుని దాడి జరగడంతో అక్కడ భారీ పేలుళ్లు సంభవించాయి. రిఫైనరీ నుంచి దట్టమైన నల్లటి పొగలు ఆకాశాన్ని కమ్మేయడంతో స్థానికుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ఇటీవలి కాలంలో తమ నగరంపై జరిగిన అతిపెద్ద డ్రోన్ దాడి ఇదేనని యరోస్లావిల్ గవర్నర్ మిఖాయిల్ ఎవ్రేవ్ తెలిపారు. ఈ దాడిలో మొత్తం 605 డ్రోన్లను ఉక్రెయిన్ ప్రయోగించిందని, వాటిలో 92 డ్రోన్లను యరోస్లావిల్ ప్రాంతంలోనే రష్యా వైమానిక రక్షణ వ్యవస్థ కూల్చివేసిందని అధికారులు వెల్లడించారు. మాస్కోతో పాటు నల్ల సముద్ర తీర ప్రాంతాలు, పలు ఇతర ప్రాంతాలు కూడా డ్రోన్ దాడుల లక్ష్యంగా మారినట్లు పేర్కొన్నారు. అత్యాధునిక వైమానిక రక్షణ వ్యవస్థలను ఉపయోగించి పెద్ద ఎత్తున డ్రోన్లను అడ్డుకున్నామని రష్యా ప్రకటించింది.

దాడికి గురైన స్లావ్‌నెఫ్ట్--యానోస్ ఆయిల్ రిఫైనరీ రష్యాలోని అతిపెద్ద ఐదు రిఫైనరీల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. ప్రతి ఏడాది సుమారు 15 మిలియన్ టన్నుల ముడి చమురును శుద్ధి చేసే సామర్థ్యం ఈ కేంద్రానికి ఉంది. కార్లు, విమానాలు, పరిశ్రమలకు అవసరమైన ఇంధన ఉత్పత్తిలో ఈ రిఫైనరీ కీలక పాత్ర పోషిస్తోంది. 1961లో నిర్మించిన ఈ రిఫైనరీ దేశ ఇంధన సరఫరా వ్యవస్థలో వ్యూహాత్మక ప్రాధాన్యం



మొదటిపేజీ తరువాయి

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలే లక్ష్యం

**ాఇండెంట్ ప్రక్రియకు మార్గదర్శకం**

ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందుల కొరత రాకుండా ఉండేందుకు ఫార్మసీ అధికారులు, వైద్యులు, పరిపాలనా అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని సంధ్యారాణి తెలిపారు. మందుల వినియోగం ,నిల్వలు, భవిష్యత్ అవసరాలు, సీజనల్ వ్యాధుల తీవ్రత వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని ఇండెంట్‌లు సిద్ధం చేయాలని సూచించారు.అవసరానికి మించిన ఇండెంట్‌లు పంపడం లేదా అవసరమైన మందులను ఇండెంట్‌లో చేర్చకపోవడం వల్ల సరఫరా వ్యవస్థపై ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొంటూ, వాస్తవ అవసరాల ఆధారంగానే ఇండెంట్‌లు రూపొందించాలని సూచించారు.

**ప్రభుత్వ నిధుల సద్వినియోగం**

ప్రభుత్వం ప్రజలకు ఉచితంగా మందులు అందించేందుకు ప్రతి సంవత్సరం భారీ మొత్తంలో నిధులు వెచ్చిస్తోందని, అందువల్ల ఒక్కో ఔషధాన్ని కూడా బాధ్యతాయుతంగా వినియోగించడం ప్రతి వైద్య ఉద్యోగి బాధ్యత అని ఆమె పేర్కొన్నారు. అవసరమైన చోట అవసరమైన మందులను మాత్రమే వినియోగించడం ద్వారా ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించడమే కాకుండా, మందుల వృథాను కూడా నివారించవచ్చని చెప్పారు.

**రోగులకు మెరుగైన సేవలే ప్రధాన లక్ష్యం**

సీఎంఎస్ ద్వారా సరఫరా అయ్యే మందులపై పూర్తి అవగాహన ఉండటం వల్ల వైద్యులు ప్రభుత్వ సరఫరాలో ఉన్న ఔషధాలనే ప్రాధాన్యంగా సూచించే అవకాశం ఉంటుందని, తద్వారా రోగులపై ఆర్థిక భారం తగ్గడంతో పాటు ఉచిత వైద్య సేవలపై ప్రజల విశ్వాసం మరింత పెరుగుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న మందులపై సరైన సమాచారం లేకపోవడం వల్ల గతంలో ఎదురైన కొన్ని ఇబ్బందులకు ఈ లిస్ట్ బుక్ పరిష్కారంగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. వైద్యులు, ఫార్మసిస్టులు, నర్సింగ్ సిబ్బంది, ఆసుపత్రి పరిపాలనా విభాగాల మధ్య సమన్వయాన్ని పెంచడంలో కూడా ఈ పుస్తకం కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు.

**ప్రిన్సిపల్ డాక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ...**

"సెంట్రల్ మెడిసిన్ స్టోర్స్ ద్వారా సరఫరా అయ్యే ప్రతి మంది, ప్రతి సర్జికల్ వస్తువు గురించి వైద్యులకు పూర్తి అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ సమగ్ర లిస్ట్ బుక్‌ను అందిస్తున్నాం. ప్రభుత్వ సరఫరాలో ఉన్న ఔషధాలను సమర్థవంతంగా వినియోగించడం ద్వారా ప్రజలకు నాణ్యమైన, ఉచిత వైద్య సేవలు అందించడమే మా ప్రధాన లక్ష్యం. మందుల ఇండెంట్‌లు కూడా వాస్తవ అవసరాల ఆధారంగానే రూపొందించాలి. ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలో మందుల నిర్వహణ మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా సాగేందుకు ఈ పుస్తకం ఉపయోగపడుతుంది."రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో సెంట్రల్ మెడిసిన్ స్టోర్స్ ద్వారా ప్రభుత్వ ఆసుపత్రులకు వందలాది రకాల ఔషధాలు, సర్జికల్ వస్తువులు క్రమం తప్పకుండా సరఫరా అవుతున్నాయి. ఈ సరఫరా వ్యవస్థను మరింత సమర్థవంతంగా వినియోగించేందుకు, వైద్యులు ప్రభుత్వ సరఫరాలోని ఔషధాలపై పూర్తి అవగాహనతో చికిత్స అందించేందుకు సీఎంఎస్ రూపొందించిన ఈ లిస్ట్ బుక్ ఒక ప్రామాణిక మార్గదర్శక గ్రంథంగా ఉపయోగపడనుంది.ప్రభుత్వ వైద్య సేవల నాణ్యతను పెంచడం, మందుల సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడం, ప్రభుత్వ నిధుల సద్వినియోగం, రోగులకు ఉచితంగా నాణ్యమైన చికిత్స అందించడం వంటి లక్ష్యాల సాధనలో సెంట్రల్ మెడిసిన్ స్టోర్స్ విడుదల చేసిన ఈ సమగ్ర మందులు--సర్జికల్స్ లిస్ట్ బుక్ కీలక పాత్ర పోషించనుందని వైద్య వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ వైద్య వ్యవస్థలో ఇది ఒక ఉపయోగకరమైన రిఫరెన్స్ డాక్యుమెంట్‌గా నిలవనుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# కేబినెట్ సమావేశంలో చంద్రబాబు ఘాటు వ్యాఖ్యలు



సమర్థవంతంగా తిప్పికొట్టాలని తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలకు ముఖ్యమంత్రి సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, నియామకాల్లో పారదర్శకతను ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ పరామర్శలకు వస్తున్నారనే సమాచారం వచ్చినప్పుడల్లా అక్కడ ఏం జరుగుతుందోనన్న ఆందోళన ప్రజల్లో వ్యక్తమవుతోందని చంద్రబాబు ఎద్దేవా చేశారు. ప్రజలను రెచ్చగొట్టే రాజకీయాలకు బదులుగా బాధ్యతాయుతమైన రాజకీయాలు చేయాలని ప్రతిపక్షానికి సూచించారు.

ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై పూర్తిస్థాయిలో దృష్టి సారించిందని, ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే తప్పుడు ప్రచారాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు, పారదర్శక పాలనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలపై చట్టప్రకారం వ్యవహరిస్తామని, ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రజలకు వాస్తవాలను చేరవేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

# ప్రపంచ తల్లిపాల వారోత్సవాలకు శ్రీకారం

ఆదిలాబాద్,(రిపబ్లిక్ హిందుస్థాన్): : ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ఆదిలాబాద్ గ్రామీణ మండలంలోని సిరికొండ గ్రామంలో గురువారం ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాజర్షిషా ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. తల్లిపాల ప్రాధాన్యంపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా తల్లిపాల వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషకాహార ఆహార ప్రదర్శనలను సందర్శించి పరిశీలించారు.

చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పోషకాహారంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.గ్రామానికి చెందిన పలువురు చిన్నారులకు జిల్లా కలెక్టర్ స్వయంగా అన్నప్రాసన నిర్వహించారు. శిశువుల ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు తల్లిపాలు అత్యంత అవసరమని, పుట్టిన వెంటనే తల్లిపాలను అందించడం ద్వారా శిశువులకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. తల్లులు శిశువులకు తొలి ఆరు నెలలు పూర్తిగా తల్లిపాలే ఇవ్వాలని సూచించారు. తల్లి పాల వల్ల శిశువులకు అవసరమైన అన్ని పోషకాలు సహజసిద్ధంగా అందుతాయని, తల్లి ఆరోగ్యానికి కూడా ఇది ఎంతో మేలు చేస్తుందని అధికారులు వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో తల్లిపాల ప్రాధాన్యంపై మరింత అవగాహన కల్పించేందుకు అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు విస్తృత ప్రచారం చేపట్టాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి మిల్కా, గ్రామ సర్పంచ్ మాధవి కిషన్, ఆదిలాబాద్ గ్రామీణ మండల తహసీల్దార్ గోవింద్, సీడీపీఓ సౌందర్య, వైద్యాధికారిణి డాక్టర్ ఆశాకిరణ్, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతానికి అధికారులు సమన్వయంతో పనిచేశారు.

ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా జిల్లావ్యాప్తంగా ఇటువంటి అవగాహన కార్యక్రమాలను నిర్వహించి తల్లి, శిశు ఆరోగ్యంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో తల్లిపాల ప్రాధాన్యం ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు.

# సవరించిన బడ్జెట్‌కు సీఎం ప్రశంసలు

- ఆర్థిక మంత్రిని అభినందించిన సీఎం జోసెఫ్ విజయ్
- ప్రజా సంక్షేమమే బడ్జెట్ లక్ష్యమని వ్యాఖ్య




తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సవరించిన బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, అభివృద్ధి శాఖ మంత్రి ఎన్. మారి విల్సన్‌ను అభినందించారు. బాధ్యతలు చేపట్టిన మూడు నెలల్లోనే ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని అందరికీ ఆమోదయోగ్యమైన బడ్జెట్‌ను సమర్పించారని ప్రశంసించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, సవరించిన బడ్జెట్ విద్యార్థులు, యువత, మహిళలు, చిన్నారులు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు, కార్మికులు, మత్స్యకారులు, చేనేత కార్మికులు, పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వ ఉద్యోగులు తదితర అన్ని వర్గాల అభివృద్ధికి దోహదపడేలా రూపొందించబడిందని అన్నారు. ఈ బడ్జెట్ సమాజంలోని ప్రతి వర్గంలో కొత్త ఆశలను నింపుతుందని పేర్కొన్నారు.

వ్యవసాయ బడ్జెట్ రాష్ట్ర వ్యవసాయాభివృద్ధితో పాటు పశుసంవర్ధక, మత్స్య, పాల ఉత్పత్తి, ఆహార శుద్ధి, విలువ ఆధారిత పరిశ్రమల అభివృద్ధికి కూడా ప్రాధాన్యం ఇచ్చిందని ముఖ్యమంత్రి తెలిపారు. రైతుల ఆదాయం పెంచడంతో పాటు వారి జీవనోపాధిని మరింత బలోపేతం చేసే విధంగా పథకాలు రూపొందించినట్లు పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం, సమగ్ర అభివృద్ధి అనే ద్వంద్వ లక్ష్యాలతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని సీఎం జోసెఫ్ విజయ్ స్పష్టం చేశారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధితో పాటు అన్ని వర్గాల సంక్షేమాన్ని సమానంగా దృష్టిలో ఉంచుకుని బడ్జెట్ రూపకల్పన జరిగిందని వివరించారు.

రాష్ట్ర ప్రగతికి అవసరమైన మౌలిక సదుపాయాలు, ఉపాధి అవకాశాల కల్పన, సామాజిక సంక్షేమ కార్యక్రమాలకు ఈ బడ్జెట్ మరింత బలం చేకూరుస్తుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పాలన కొనసాగిస్తుందని తెలిపారు. సుభిక్షమైన తమిళనాడు నిర్మాణ దిశగా ప్రభుత్వం చేపట్టిన విజయయాత్ర నిరంతరం కొనసాగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పునరుద్ఘాటిస్తూ ఆర్థిక మంత్రికి మరోసారి అభినందనలు తెలిపారు.

## భారత్‌లో రెడ్‌మీ నోట్ 17 5జీ విడుదల.. ప్రారంభ ధర రూ.27,999




న్యూఢిల్లీ, షావోమీ సబ్‌బ్రాండ్ రెడ్‌మీ భారత్‌లో రెడ్‌మీ నోట్ 17 5జీ స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేసింది. ఈ సిరీస్‌లో భారత మార్కెట్‌కు వచ్చిన తొలి మోడల్ ఇదే. 8,000 ఎంఏహెచ్ భారీ బ్యాటరీ, 120 హెర్ట్జ్ అమోలెడ్ డిస్‌ప్లే, స్నాప్‌డ్రాగన్ 4 జెన్ 4 ప్రాసెసర్‌తో ఈ ఫోన్‌ను తీసుకొచ్చింది. ప్రారంభ ధరను రూ.27,999గా నిర్ణయించింది.

6జీబీ ర్యామ్, 128జీబీ స్టోరేజ్ వేరియంట్ ధర రూ.27,999 కాగా, 8జీబీ ర్యామ్, 128జీబీ స్టోరేజ్ మోడల్ ధర రూ.30,999గా ఉంది. ఎస్‌బీఐ, యాక్సిస్, కొటక్ క్రెడిట్ కార్డులతో కొనుగోలు చేసే వారికి రూ.3,000 తక్షణ తగ్గింపు లభిస్తుంది. ఆగస్టు 12 నుంచి అమెజాన్‌తో పాటు షావోమీ అధికారిక ఆన్‌లైన్ స్టోర్‌లో విక్రయాలు ప్రారంభం కానున్నాయి.ఈ స్మార్ట్‌ఫోన్‌లో 6.9 అంగుళాల ఫుల్ హెచ్‌డీ ప్లస్ ట్రూకలర్ అమోలెడ్ డిస్‌ప్లే, 120 హెర్ట్జ్ రిఫ్రెష్ రేట్, 1,800 నిట్స్ గరిష్ఠ బ్రైట్‌నెస్‌ను అందించారు. ఆండ్రాయిడ్ 16 ఆధారిత హైపర్ ఓఎస్ 3పై పనిచేసే ఈ ఫోన్‌కు నాలుగేళ్ల ఆపరేటింగ్ సిస్టమ్ అప్‌డేట్లు, ఆరేళ్ల భద్రతా అప్‌డేట్లు అందిస్తామని కంపెనీ ప్రకటించింది.

ఆక్టాకోర్ స్నాప్‌డ్రాగన్ 4 జెన్ 4 చిప్‌సెట్‌తో పనిచేసే ఈ ఫోన్‌లో గరిష్ఠంగా 8జీబీ ర్యామ్, 256జీబీ స్టోరేజ్ అందుబాటులో ఉంది. మైక్రో ఎస్‌డీ కార్డు ద్వారా 2టీబీ వరకు మెమరీని విస్తరించుకునే అవకాశం కల్పించారు. ఐపీ65 డస్ట్, వాటర్ రెసిస్టెన్స్‌తో పాటు మెరుగైన కూలింగ్ సిస్టమ్‌ను కూడా పొందుపరిచారు.

ఫొటోగ్రఫీ కోసం 50 మెగాపిక్సెల్ ప్రధాన కెమెరాతో పాటు మరో సెకండరీ కెమెరా అందించారు. సెల్ఫీలు, వీడియో కాల్స్ కోసం 8 మెగాపిక్సెల్ ఫ్రంట్ కెమెరా ఉంది. 45 వాట్ల ఫాస్ట్ ఛార్జింగ్‌కు మద్దతిచ్చే 8,000 ఎంఏహెచ్ భారీ బ్యాటరీ ఈ ఫోన్ ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. ఒక్కసారి పూర్తిగా ఛార్జ్ చేస్తే దాదాపు రెండున్నర రోజుల పాటు ఉపయోగించవచ్చని కంపెనీ తెలిపింది. అదనంగా 22.5 వాట్ల రివర్స్ ఛార్జింగ్ సదుపాయాన్ని కూడా అందించింది.

## స్త్రీనిధి రుణాలతో మహిళలకు ఈ--వాహనాల కొనుగోలు అవకాశం



హైదరాబాద్ ,(రిపబ్లిక్‌హిందుస్థాన్): మహిళల ఆర్థిక స్వావలంబనను పెంపొందించడంతో పాటు ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం స్త్రీనిధి ద్వారా ప్రత్యేక రుణ పథకాన్ని అమలు చేయడానికి సిద్ధమవుతోంది. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు ఎలక్ట్రిక్ ఆటోలు, ఎలక్ట్రిక్ ద్విచక్రవాహనాలు కొనుగోలు చేసేందుకు తక్కువ వడ్డీపై రుణాలు పొందేలా ప్రణాళిక రూపొందించారు.

ప్రస్తుతం డెలివరీ సేవలు, క్యాబ్ సర్వీసులు, సరుకు రవాణా వంటి రంగాల్లో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం వేగంగా పెరుగుతోంది. నిర్వహణ వ్యయం తక్కువగా ఉండటం, ఇంధన ఖర్చు లేకపోవడం వల్ల ఈ వాహనాల ద్వారా మెరుగైన ఆదాయం పొందే అవకాశం ఉంది. ఈ అవకాశాన్ని మహిళలు కూడా అందిపుచ్చుకునేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

ఈ పథకం ద్వారా కొనుగోలు చేసే ఎలక్ట్రిక్ ప్రయాణికుల ఆటోలను ప్రయాణికుల రవాణాకు వినియోగించవచ్చు. అలాగే ఎలక్ట్రిక్ ట్రాలీ ఆటోలతో చిన్న వ్యాపారాలు, మార్కెట్ సరుకు రవాణా, వ్యవసాయ ఉత్పత్తుల తరలింపు వంటి పనులు నిర్వహించవచ్చు. ఎలక్ట్రిక్ ద్విచక్రవాహనాలతో ఈ--కామర్స్ డెలివరీలు, కొరియర్ సేవలు, ఆహార పంపిణీ, ఫీల్డ్ సేవలు వంటి అనేక రంగాల్లో ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

ఈ పథకం కింద రుణం పొందే మహిళలు ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలను ఆశ్రయించాల్సిన అవసరం ఉండదు. సులభ వాయిదాల్లో రుణాన్ని తిరిగి చెల్లించే అవకాశం కల్పించడంతో కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గనుంది. మహిళలతో పాటు వారి కుటుంబ సభ్యులు కూడా ఈ వాహనాలను వినియోగించి అదనపు ఆదాయం పొందే అవకాశం ఉంది.పథకం ప్రకారం ఎలక్ట్రిక్ ప్రయాణికుల ఆటో కొనుగోలుకు రూ.2.74 లక్షలు, ఎలక్ట్రిక్ ట్రాలీ ఆటోకు రూ.3.13 లక్షల వరకు రుణం అందించనున్నారు.

ఈ రుణాన్ని వార్షిక 11 శాతం వడ్డీతో 60 నెలల్లో తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. ఒక్కసారి పూర్తిగా ఛార్జ్ చేస్తే సుమారు 100 కిలోమీటర్ల వరకు ప్రయాణించే సామర్థ్యం ఉండటంతో నిర్వహణ వ్యయం కూడా తగ్గుతుంది.అదేవిధంగా ఎలక్ట్రిక్ ద్విచక్రవాహనం కొనుగోలుకు రూ.1 లక్ష వరకు రుణం మంజూరు చేయనున్నారు. ఈ మొత్తాన్ని 48 నెలల్లో వాయిదాల రూపంలో చెల్లించే వెసులుబాటు కల్పించనున్నారు

.ఈ పథకం అమలుతో మహిళలకు కొత్త ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు వారి ఆదాయం పెరిగే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. మరోవైపు రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరగడం ద్వారా కాలుష్యం తగ్గి పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పాటు అందుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

## పాత్రకే ప్రాధాన్యం ఇచ్చా.. గ్లామర్ నా దారి కాదు: మీనా



తెలుగు, తమిళ చిత్ర పరిశ్రమల్లో తనదైన నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ నటి మీనా, తన సినీ ప్రయాణంలో ఎదురైన అనుభవాలను, గ్లామర్ పాత్రలపై తన అభిప్రాయాన్ని తాజాగా వెల్లడించారు. కెరీర్ ప్రారంభంలో గ్లామర్ పాత్రలు చేసిన నటీమణులకు లభించే గుర్తింపును చూసి తానూ అలాంటి పాత్రలు చేయాలా అని ఒక దశలో ఆలోచించానని చెప్పారు.తాను కూడా కథానాయికనే అయినప్పటికీ, కొందరికి లభిస్తున్నంత ప్రాధాన్యం తనకు ఎందుకు రావడం లేదని బాధపడేదాన్నని, ఆ విషయమై తన తల్లితో ఏడ్చిన సందర్భాలు కూడా ఉన్నాయని మీనా తెలిపారు. అయితే, ఆ తర్వాత తన దృష్టి పూర్తిగా పాత్రల ఎంపికపైకి మళ్లిందని చెప్పారు.“నా పాత్ర ఏమిటి? ఆ పాత్రకు నేను ఎంత న్యాయం చేయగలను? ప్రేక్షకులు సినిమా చూసి బయటకు వచ్చిన తర్వాత నా పాత్రను గుర్తుపెట్టుకుంటారా?” అనే అంశాలనే ప్రతి సినిమా ఎంపికలో ప్రధానంగా పరిగణించానని ఆమె వివరించారు.

స్విమ్‌సూట్ సన్నివేశం తర్వాత నిర్ణయంఒక తమిళ చిత్రంలో స్విమ్‌సూట్‌లో నటించే అవకాశం వచ్చిన విషయాన్ని కూడా మీనా గుర్తు చేసుకున్నారు. ఆ పాత్రకు అంగీకరించినప్పటికీ, ఆ వేషధారణలో తాను తీవ్ర అసౌకర్యానికి గురయ్యానని చెప్పారు. మేకప్ గది నుంచి బయటకు రావడానికే ఇబ్బంది పడ్డానని, నృత్యం చేయడం కూడా కష్టంగా అనిపించిందని తెలిపారు.సన్నివేశాన్ని పూర్తి చేసిన తర్వాత అలాంటి పాత్రలు తనకు సరిపోవని నిర్ణయించుకున్నానని చెప్పారు. ఆ సినిమా విడుదలైన తర్వాత ప్రేక్షకులు కూడా “మీనా ఇలా చేయాల్సిన అవసరం ఏముంది?” అని స్పందించారని, అప్పుడే తన అసలైన బలం నటనలోనే ఉందని మరింత స్పష్టంగా అర్థమైందని వెల్లడించారు.ఆరోగ్యకరమైన పోటీ.. అందరితో స్నేహమే తన సమకాలీన నటీమణులు రోజా, సౌందర్య, రంభ, రమ్యకృష్ణ, నగ్మా తదితరులతో ఆరోగ్యకరమైన పోటీ ఉండేదని మీనా తెలిపారు. ఒకరు చేయలేని పాత్రలను మరొకరు చేయడం సహజమేనని, అయితే చిత్రీకరణ పూర్తయ్యాక అందరితోనూ స్నేహపూర్వక సంబంధాలే కొనసాగాయని చెప్పారు. పని సమయంలో మాత్రమే అత్యుత్తమంగా నటించాలనే లక్ష్యంతో ఉండేదాన్నని, చిత్రీకరణ పూర్తయ్యాక అందరూ ఒకే కుటుంబ సభ్యుల్లా కలిసిపోయేవారమని పేర్కొన్నారు. ఇప్పటికీ 1990ల తరం నటీమణులంతా కలిసి పండుగలు, ప్రత్యేక వేడుకలు జరుపుకుంటూ స్నేహాన్ని కొనసాగిస్తున్నామని మీనా తెలిపారు

## ‘రాకా’ షూటింగ్‌కు ఆటంకం లేదు..

### – ముందస్తు ప్రణాళికతో ముందుకెళ్తున్న చిత్రబృందం

ముంబై, బాలీవుడ్ స్టార్ నటి దీపికా పదుకొణె ప్రస్తుతం మాతృత్వాన్ని ఆస్వాదిస్తూ కుటుంబంతో సమయం గడుపుతున్నారు. ఈ నేపథ్యంలో ఆమె మెటర్నిటీ విరామం కారణంగా ప్రతిష్టాత్మక చిత్రం ‘రాకా’ చిత్రీకరణకు ఆటంకం ఏర్పడుతుందనే ప్రచారం జరిగినప్పటికీ, చిత్రబృందం ముందస్తు ప్రణాళికతో ఎలాంటి అంతరాయం లేకుండా పనులను కొనసాగిస్తున్నట్లు సినీ వర్గాలు తెలిపాయి.ఈ చిత్రంలో దీపికా పదుకొణె పోషిస్తున్న పాత్ర కథలో అత్యంత కీలకమైనదిగా ఉండనున్నట్లు తెలుస్తోంది. ఆమె పాత్ర చుట్టూనే కథలో ప్రధాన మలుపులు చోటుచేసుకుంటాయని ప్రచారం జరుగుతోంది. అందుకే ప్రారంభ దశలోనే ఆమెకు సంబంధించిన ముఖ్యమైన సన్నివేశాలన్నింటినీ పూర్తి చేసినట్లు సమాచారం.

భారీ తారాగణం, అత్యాధునిక సాంకేతిక ప్రమాణాలు, భారీ వ్యయంతో రూపొందుతున్న ‘రాకా’పై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. దీపికా మెటర్నిటీ విరామం సినిమా నిర్మాణంపై ఎలాంటి ప్రభావం చూపకుండా చిత్రబృందం సమర్థవంతమైన ప్రణాళికతో ముందుకు సాగడం ప్రస్తుతం బాలీవుడ్‌లో చర్చనీయాంశమైంది. చిత్రీకరణ నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారమే కొనసాగుతున్న నేపథ్యంలో, సినిమా కూడా అనుకున్న సమయానికే ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాలు భావిస్తున్నాయి.



## 750 సీసీ ఇంజిన్‌తో రానున్న రాయల్ ఎన్‌ఫీల్డ్

లండన్, ,(రిపబ్లిక్ హిందుస్థాన్): ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ రాయల్ ఎన్‌ఫీల్డ్ తన అత్యంత ప్రతిష్ఠాత్మక అడ్వెంచర్ టూరర్ బైక్ హిమాలయన్ 750 ఉత్పత్తి నమూనాను బ్రిటన్‌లో పరీక్షిస్తున్న సమయంలో లీక్ కావడంతో ఈ మోడల్‌పై ఆసక్తి మరింత పెరిగింది. యునైటెడ్ కింగ్‌డమ్‌లోని లెస్టర్‌షైర్‌లో ఉన్న కంపెనీ సాంకేతిక కేంద్రం సమీపంలో పరీక్షలు నిర్వహిస్తుండగా ఈ బైక్‌కు సంబంధించిన చిత్రాలు వెలుగులోకి వచ్చాయి.ఈ కొత్త మోడల్‌ను నవంబర్‌లో జరిగే అంతర్జాతీయ ఈఐసీఎంఏ 2026 ఆటో ప్రదర్శనలో ప్రపంచానికి అధికారికంగా పరిచయం చేసే అవకాశం ఉందని ఆటోమొబైల్ వర్గాలు భావిస్తున్నాయి.ప్రస్తుతం విక్రయాల్లో ఉన్న హిమాలయన్ 450 రూపకల్పనను పోలి ఉన్నప్పటికీ, దీర్ఘదూర ప్రయాణాలను దృష్టిలో ఉంచుకుని ఈ 750 సీసీ మోడల్‌లో పలు కీలక మార్పులు చేసినట్లు తెలుస్తోంది.

కొత్త హిమాలయన్‌లో 270 డిగ్రీల క్రాంక్‌షాఫ్ట్‌తో కూడిన 750 సీసీ ట్విన్ సిలిండర్ ఇంజిన్ ను అమర్చనున్నట్లు సమాచారం. ప్రస్తుతం అందుబాటులో ఉన్న 650 సీసీ ఇంజిన్‌తో పోలిస్తే ఇది మరింత శక్తి, అధిక టార్క్‌ను అందించనుంది.రాయల్ ఎన్‌ఫీల్డ్ చరిత్రలో తొలిసారిగా ఈ బైక్‌లో రైడ్–బై–వైర్ సాంకేతికతను ప్రవేశపెట్టనున్నారు. దీని ద్వారా విభిన్న రైడింగ్ మోడ్‌లు, క్రూయిజ్ కంట్రోల్ వంటి ఆధునిక సదుపాయాలు లభించనున్నాయి.

దీర్ఘ ప్రయాణాలకు అనువుగా పెద్ద ఇంధన ట్యాంక్, తక్కువ ఎత్తులో సౌకర్యవంతమైన సీటు, గాలి ప్రభావాన్ని తగ్గించే విండ్‌స్క్రీన్, హెడ్‌ల్యాంప్‌కు అనుసంధానించిన ఫెయిరింగ్‌ను ఏర్పాటు చేశారు. అలాగే హిమాలయన్ 450 తరహాలోనే గుండ్రటి డిజిటల్ డిస్‌ప్లేను కూడా అందించనున్నారు.

సస్పెన్షన్ వ్యవస్థలో ముందు భాగంలో షోవా యూఎస్‌డీ ఫోర్కులు, వెనుక భాగంలో రిమోట్ ప్రీలోడ్ అడ్జస్టర్‌తో కూడిన మోనోషాక్‌ను అమర్చనున్నారు. భద్రత కోసం ముందు భాగంలో ట్విన్ డిస్క్ బ్రేకులు, 19 అంగుళాల అల్లాయ్ వీల్స్‌తో పాటు సీయట్ టైర్లను వినియోగించనున్నట్లు సమాచారం.

ఈ కొత్త 750 సీసీ ప్లాట్‌ఫామ్‌పై



# 141 మంది కళాకారులకు కళ్లజోళ్లు పంపిణీ

## దృష్టి సమస్యలపై ఉచిత నేత్ర వైద్య శిబిరాలు
## మరో 350 మందికి కళ్లజోళ్లు సిద్ధం - కంటిశుక్లం బాధితులకు శస్త్రచికిత్సలు



అమరావతి,(రిపబ్లిక్ హిందుస్థాన్):క్రోచెట్ లేస్ కళాకారుల ఆరోగ్య సమస్యలను గుర్తించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వారి దృష్టి లోపాల నివారణకు చర్యలు చేపట్టారు. గంటల తరబడి సూక్ష్మమైన అల్లికలు చేస్తూ చూపు సమస్యలు ఎదుర్కొంటున్న కళాకారులకు ఉచితంగా కళ్లజోళ్లు అందజేయాలని ఆదేశించగా, తొలి దశలో 141 మంది కళాకారులకు కళ్లజోళ్లు సిద్ధం చేసి పంపిణీ చేశారు. గత నెల విజయవాడలో నిర్వహించిన హస్తకళా మహోత్సవ ప్రారంభోత్సవంలో కళాకారులతో మాట్లాడిన పవన్ కళ్యాణ్‌కు నరసాపురం నియోజకవర్గంలోని పసలదీవికి చెందిన క్రోచెట్ లేస్ కళాకారిణి మహాలక్ష్మి తమ వృత్తి కారణంగా చూపు మందగిస్తోందని వివరించారు. దీనిపై వెంటనే స్పందించిన ఉప ముఖ్యమంత్రి రాష్ట్రవ్యాప్తంగా హస్తకళాకారుల కోసం క్లస్టర్ల వారీగా ఉచిత నేత్ర వైద్య శిబిరాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

ఆదేశాల మేరకు నరసాపురంలో నిర్వహించిన తొలి నేత్ర వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించగా, 141 మందికి కళ్లజోళ్లు అవసరమని వైద్యులు గుర్తించారు. దీంతో వారికి ఉచితంగా కళ్లజోళ్లు అందించే ఏర్పాట్లు పూర్తిచేశారు. కళాకారులు ఆరోగ్యంగా ఉంటేనే వారి జీవనోపాధి మరింత మెరుగుపడుతుందని అధికారులు తెలిపారు. ఇప్పటికే పాలకొల్లు పరిధిలోని యలమంచిలి, అత్తిలిలో మరో రెండు నేత్ర వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాల్లో కూడా దృష్టి లోపాలు ఉన్న మరో 350 మంది కళాకారులను గుర్తించి వారికి కళ్లజోళ్లు అందించే ప్రక్రియ కొనసాగుతోంది. అలాగే 20 మందికి పైగా కంటిశుక్లం సమస్య ఉన్నట్లు వైద్యులు గుర్తించగా, వారికి శస్త్రచికిత్సలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు.

ఉప ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఆచంట, నరసాపురం ప్రాంతాల్లో కూడా మరిన్ని నేత్ర వైద్య శిబిరాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా హస్తకళాకారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని అధికారులు తెలిపారు. క్రోచెట్ లేస్ కళాకారుల కష్టాలను గుర్తించి వైద్య సేవలు, కళ్లజోళ్లు అందించడం పట్ల కళాకారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ చర్యలతో వారి జీవనోపాధికి తోడ్పాటుతో పాటు ఆరోగ్య పరిరక్షణకు కూడా ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు.

# 216 మంది పోలీసులకు సీపీ .........

- రివార్డ్ మేళాలో ప్రతిభావంతుల సత్కారం
- సాంకేతికత వినియోగంపై సీపీ దిశానిర్దేశం





సైబరాబాద,(రిపబ్లిక్ హిందుస్థాన్): నేరాల నియంత్రణ, నేరాల ఛేదన, శాంతిభద్రతల పరిరక్షణలో విశేష ప్రతిభ కనబరిచిన 216 మంది పోలీసు సిబ్బందిని సైబరాబాద్ పోలీసు కమిషనర్ డా. ఎం. రమేష్ ఘనంగా సత్కరించారు. సైబరాబాద్ కమిషనరేట్‌లో నిర్వహించిన రివార్డ్ మేళా కార్యక్రమంలో ప్రశంసాపత్రాలు, పురస్కారాలను అందజేసి వారి సేవలను అభినందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రజల భద్రతే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. నేరాల నివారణ, నేరస్థుల గుర్తింపు, శాంతిభద్రతల పరిరక్షణలో అంకితభావంతో పనిచేసిన అధికారులు, సిబ్బంది సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. ఇలాంటి గుర్తింపు పోలీసు సిబ్బందిలో మరింత ఉత్సాహాన్ని నింపుతుందని అన్నారు. ఆస్తులకు సంబంధించిన నేరాల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కమిషనర్ సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, సీసీ కెమెరాల విశ్లేషణ, డిజిటల్ దర్యాప్తు సాధనాలను సమర్థవంతంగా వినియోగించి నేరాల నియంత్రణను మరింత బలోపేతం చేయాలని అధికారులకు సూచించారు. నిరంతర శిక్షణ ద్వారా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజలకు వేగవంతమైన, నాణ్యమైన పోలీసు సేవలు అందించేందుకు ప్రతి అధికారి సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించాలని కమిషనర్ పేర్కొన్నారు. మారుతున్న నేరాల స్వరూపానికి అనుగుణంగా దర్యాప్తు విధానాలను కూడా ఎప్పటికప్పుడు నవీకరించుకోవాలని సూచించారు.

రివార్డ్ మేళా కార్యక్రమంలో పరిపాలన డీసీపీ టి. అన్నపూర్ణ, కుత్బుల్లాపూర్ డీసీపీ ఎన్. కోటి రెడ్డి, కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్, క్రైమ్స్/ఈఓడబ్ల్యూ డీసీపీ ఎ. ముత్యం రెడ్డి, ఎస్‌వోటీ డీసీపీ శోభన్ కుమార్, ఏసీపీలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. సత్కారం అందుకున్న పోలీసు సిబ్బందికి కమిషనర్ అభినందనలు తెలియజేస్తూ, ఇదే స్ఫూర్తితో ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసేలా సమర్థవంతమైన సేవలు అందించాలని పిలుపునిచ్చారు. నేరాల నియంత్రణలో సైబరాబాద్ పోలీసు శాఖ మరింత మెరుగైన ఫలితాలు సాధించే దిశగా కృషి కొనసాగించాలని సూచించారు.

# జక్కంపూడి రామ్మోహన్‌రావుకు జగన్ నివాళి

- వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో జయంతి కార్యక్రమం
- పార్టీ నేతలతో కలిసి నివాళులర్పించిన ప్రముఖులు

తాడేపలి,(రిపబ్లిక్ హిందుస్థాన్): మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహన్‌రావు జయంతి సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జక్కంపూడి రామ్మోహన్‌రావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై ఆయన సేవలను స్మరించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ జక్కంపూడి రామ్మోహన్‌రావు ప్రజా జీవితమంతా ప్రజల సంక్షేమానికే అంకితమైందని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఆయన ఎల్లప్పుడూ ముందుండేవారని, ప్రజలతో మమేకమై పనిచేసిన నాయకుడిగా ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారని కొనియాడారు. ఆయన సేవలు రాజకీయాల్లో ఆదర్శంగా నిలిచిపోతాయని అన్నారు.

వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబంతో జక్కంపూడి రామ్మోహన్‌రావుకు ఉన్న సుదీర్ఘ అనుబంధాన్ని జగన్ ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకున్న నాయకుడిగా ఆయన ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు కృషి చేశారని పేర్కొన్నారు. ప్రజల పట్ల చూపిన అంకితభావం, సేవా దృక్పథం చిరస్మరణీయమని అన్నారు. జక్కంపూడి రామ్మోహన్‌రావు ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ ప్రజలతో సన్నిహితంగా మెలిగారని వైఎస్సార్‌సీపీ నేతలు పేర్కొన్నారు. ఆయన రాజకీయ జీవితంలో చూపిన నిబద్ధత, ప్రజా సేవ పట్ల ఉన్న అంకితభావం పార్టీ కార్యకర్తలకు స్ఫూర్తిగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు టీజేఆర్ సుధాకర్‌బాబు, ఇతర ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. జక్కంపూడి రామ్మోహన్‌రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, ఆయన సేవలను స్మరించుకున్నారు. జయంతి కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు జక్కంపూడి రామ్మోహన్‌రావు ప్రజా జీవితంలో చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. ప్రజల కోసం అంకితభావంతో పనిచేసిన నాయకుడిగా ఆయనను ఎప్పటికీ గుర్తుంచుకుంటామని తెలిపారు. కార్యక్రమం ముగింపులో ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ నివాళులర్పించారు.

# డీఎస్సీపై వైసీపీ.. నిరాహార దీక్షలు

తిరుపతి,(రిపబ్లిక్ హిందుస్థాన్): డీఎస్సీ--2025 నియామకాల్లో అక్రమాలు, అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తిరుపతిలో రిలే నిరాహార దీక్షలను ప్రారంభించింది. డీఎస్సీ నియామకాలపై సీబీఐతో విచారణ జరిపించాలని, రాజకీయ బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం తొలి రోజు దీక్షలు చేపట్టారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లా పార్టీ అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి నాయకత్వంలో, తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి ఆధ్వర్యంలో పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట ఈ నిరసన కార్యక్రమం నిర్వహించారు.

దీక్షల్లో మాజీ మేయర్ శిరీష, నగర పార్టీ అధ్యక్షుడు మల్లం రవిచంద్రరెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. డీఎస్సీ నియామకాల ప్రక్రియలో జరిగినట్లు ఆరోపిస్తున్న అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. నిజాయితీగా పరీక్షలు రాసిన నిరుద్యోగ యువతకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని వైసీపీ నాయకులు పేర్కొన్నారు. డీఎస్సీ నియామకాలపై వస్తున్న ఆరోపణలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా స్వతంత్ర దర్యాప్తునకు ఆదేశించాలని కోరారు.

ఈ రిలే నిరాహార దీక్షలు ఆగస్టు 9 వరకు ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతాయని పార్టీ నాయకులు తెలిపారు. నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. డీఎస్సీ నియామకాలపై సీబీఐ విచారణ చేపట్టాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని మరోసారి డిమాండ్ చేస్తూ వైసీపీ నాయకులు తమ నిరసనను కొనసాగించారు. ఈ అంశంపై ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.




## వందేళ్ల నాటి భవనం కుప్పకూలి

లఖ్‌నవూ ,(రిపబ్లిక్ హిందుస్థాన్): ఉత్తరప్రదేశ్‌లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు విషాదాన్ని మిగిల్చాయి. ప్రతాప్‌గఢ్ జిల్లాలో సుమారు వందేళ్ల నాటి పురాతన భవనం ఒక్కసారిగా కుప్పకూలడంతో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు.

# సామాజిక న్యాయ పోరాటమే లక్ష్యం

- సంకల్ప సభలో కవిత కీలక ప్రకటనలు
- బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్
- బడ్జెట్ సమావేశాల్లో బిల్లు ఆమోదించాలన్న హెచ్చరిక
- లేదంటే వెయ్యి కార్లతో ఛలో ఢిల్లీ చేపడతామని స్పష్టం



హైదరాబాద్,,(రిపబ్లిక్ హిందుస్థాన్): తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ కు భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ఈ సభలో టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ, సామాజిక న్యాయం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సంకల్ప సభ దేశంలోని కోట్లాది మంది జీవితాల్లో మార్పు తీసుకువచ్చే ఉద్యమానికి నాంది పలుకుతుందని పేర్కొన్నారు. కవిత మాట్లాడుతూ, బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ బిల్లును వచ్చే బడ్జెట్ సమావేశాల్లోపు ఆమోదించి ముందుకు తీసుకురావాలని కోరారు. అలా జరగకపోతే వెయ్యి కార్లతో ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపట్టి దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సామాజిక న్యాయం కోసం రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

తాను బీసీల హక్కుల గురించి మాట్లాడితే తనపై విమర్శలు చేస్తున్నారని, అయితే తన పుట్టుక తన చేతిలో లేకపోయినా ఎవరి కోసం పని చేయాలనే నిర్ణయం మాత్రం తనదేనని కవిత వ్యాఖ్యానించారు. సమాజంలోని వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం తన జీవితాన్ని అంకితం చేస్తున్నానని చెప్పారు. కుల వివక్షను పూర్తిగా నిర్మూలించేందుకు మరో దశ ఉద్యమం అవసరమని, తెలంగాణ సాధించినట్లే సామాజిక తెలంగాణను కూడా సాధించాలని పిలుపునిచ్చారు. దేశంలో సామాజిక, ఆర్థిక అసమానతలు ఇంకా కొనసాగుతున్నాయని, ఎస్సీ, ఎస్టీ, బీసీలు, ముస్లింలు, మహిళలు, ఆదివాసీలు, ట్రాన్స్‌జెండర్లు, వికలాంగులు సహా అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, ఆదివాసీలకు అడవులపై పూర్తి హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా పలు తీర్మానాలను సభ ఆమోదించింది. బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్ల కోసం దేశవ్యాప్తంగా ఉద్యమం చేపట్టడం, మహాత్మా జ్యోతిరావు పూలే దంపతులకు భారతరత్న ఇవ్వడం, ప్రొఫెసర్ జయశంకర్‌కు పద్మవిభూషణ్ ప్రకటించాలని కేంద్రాన్ని కోరడం, ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహం ఏర్పాటు చేయడం, ఎస్సీ, ఎస్టీ నిధులను ఆయా వర్గాల అభ్యున్నతికే వినియోగించడం వంటి తీర్మానాలను ప్రకటించారు. సామాజిక న్యాయ ఉద్యమాన్ని సావిత్రిబాయి పూలే జయంతి వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామానికి తీసుకెళ్తామని కవిత వెల్లడించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రొఫెసర్ జయశంకర్ చెప్పిన సామాజిక తెలంగాణ లక్ష్యాన్ని సాకారం చేసేందుకు అందరూ ఏకమై ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అన్ని వర్గాలకు సమాన హక్కులు, సమాన అవకాశాలు కల్పించే వరకు ఈ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# ముఖ్యమంత్రి పర్యటనకు పోలీసుల సన్నద్ధత

## ఎస్పీ ఆధ్వర్యంలో పోలీసులకు ప్రత్యేక బ్రీఫింగ్

బాపట,(రిపబ్లిక్ హిందుస్థాన్): రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లపై బాపట్ల జిల్లా పోలీసు యంత్రాంగం ప్రత్యేకంగా సన్నద్ధమైంది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ గురువారం పోలీసు అధికారులు, సిబ్బందికి ప్రత్యేక బ్రీఫింగ్ నిర్వహించి విధి నిర్వహణలో పాటించాల్సిన సూచనలు, జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది సమయపాలనకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. వారికి కేటాయించిన ప్రాంతాల్లో ముందుగానే చేరుకుని అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన సజావుగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు.

భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రతి అధికారి తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని ఎస్పీ పేర్కొన్నారు. ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల రాకపోకలు, వాహనాల తనిఖీలు, సభా ప్రాంగణ భద్రత వంటి అన్ని అంశాల్లో సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పర్యటన సందర్భంగా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా భద్రతా చర్యలను అమలు చేయాలని, అవసరమైన చోట ట్రాఫిక్ మళ్లింపులు, ప్రజలకు ముందస్తు సమాచారం అందించాలని అధికారులకు సూచించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక బృందాలు సిద్ధంగా ఉండాలని తెలిపారు.

బ్రీఫింగ్‌లో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బందికి విధుల పంపిణీ, భద్రతా ప్రణాళిక, సమాచార వ్యవస్థ, సమన్వయ విధానాలపై వివరంగా అవగాహన కల్పించారు. పర్యటన విజయవంతం కావడానికి ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించాలని ఎస్పీ కోరారు. ఈ సమావేశంలో జిల్లా పోలీసు శాఖకు చెందిన పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ముఖ్యమంత్రి జిల్లా పర్యటన ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు పోలీసు యంత్రాంగం పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉందని అధికారులు తెలిపారు.





# జాడలేని టైలరింగ్ హబ్స్!



వరంగల్, ఆగస్టు 6 : మహిళలకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూంసీ) పరిధిలో ఏర్పాటు చేయాలనుకున్న టైలరింగ్ హబ్‌ల జాడ కనిపించడం లేదు. నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఆ లక్ష్యం నెరవేరడం లేదు. గత పాలకవర్గంలో కొంత కదలక వచ్చినా ఇప్పుడది కనిపించడం లేదు. టైలరింగ్ హబ్‌ల ఏర్పాటు భాగంగా అత్యాధునిక కుట్టు మిషన్ల కొనుగోలు కోసం టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ ఇప్పుడు గిట్టుబాటు కావడం లేదంటూ చేతులెత్తేశాడు. దీంతో వీటి ఏర్పాటు ప్రక్రియ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందిగ్రేటర్ పరిధిలోని వరంగల్ తూర్పు, పశ్చిమ, వర్ధన్నపేట, పరకాల నియోజవర్గాలకు సంబంధించి నాలుగు టైలరింగ్ హబ్‌లు ఏర్పాటు చేయాలని కార్యాచరణ రూపొందించారు. కార్పొరేషన్ ఆధ్వర్యంలోని కమ్యూనిటీ హాల్స్‌లో వీటిని కొనసాగించాలని నిర్ణయించారు. ఒక్కో టైలరింగ్ హబ్‌లో 20 ఆధునిక కుట్టు మిషన్లతో పాటు పెద్ద టేబుల్, కటింగ్, కాజాలు, బటన్‌లు కుట్టే మిషన్లు, కుర్చీలు ప్రభుత్వ నిధులతో సమకూర్చనున్నారు. అయితే టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ చేతులేత్తేయడంతో ఇప్పటి వరకు సామగ్రి కొనుగోలు చేయకపోవడంతో టైలరింగ్ హబ్‌ల ఏర్పాటులో తీవ్ర జాప్యం జరుగుతున్నది. అయితే పాత టెండర్‌ను రద్దు చేసి, కొత్తగా పిలవాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.

టైలరింగ్ హబ్‌ల లక్ష్యం. ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్ల యూనిఫాంలు, ఎంజీఎంలోని సిబ్బంది యూనిఫాంలు కుట్టే టెండర్లు ఈ హబ్‌లకు ఇవ్వడం ద్వారా మహిళలకు ఉపాధి దొరికే అవకాశం ఉంటుంది. దీంతో పాటు టైలరింగ్ హబ్‌లలో మహిళలకు కుట్టు శిక్షణ సైతం ఇవ్వనున్నారు.